www. aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
adikavi Nannaya University
9701293231






తొలి తెలుగు విశ్వవిద్యాలయ వారపత్రిక


# నన్నయ వాణి


ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు — సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వల ఆనంద్ — ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 1 | సంచిక :25 | 29-03-2021 | పుటలు : 4


## నన్నయ వర్సిటీకి గవర్నర్ అభినందనలు



విశ్వ విద్యాలయ ప్రగతి నివేదికను గవర్నర్‌కు అందిస్తున్న వీసీ

**25.03.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్ అభినందనలు తెలియచేశారని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. గురువారం రాజ్ భవన్‌లో వీసీ మొక్కా జగన్నాథరావు గవర్నర్ బిశ్వభూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. 2020 సంవత్సరంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ప్రగతి నివేదికను గవర్నర్‌కు సమర్పించారు. కోవిడ్ సమయంలో లాక్‌డౌన్ వంటి ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ విశ్వవిద్యాలయం విద్యాపరంగా పరిపాలనాపరంగా అభివృద్ధి సాధించామని తెలియజేశారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పరీక్షలు నిర్వహించడం, రాష్ట్రంలోని అత్యధిక వెబినార్లు నిర్వహించడం, ఐఎస్ఓ గుర్తింపును సాధించడం వంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని గవర్నర్‌కు వివరించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో విద్యాపరమైన, పరిశోధన పరమైన, పరిపాలనా పరమైన ప్రణాళికను వివరించి నాక్ గుర్తింపు సాధనంగా ప్రయత్నాలు చేస్తున్నామని తెలియజేశారు. వీటిపై స్పందించిన గవర్నర్ విశ్వవిద్యాలయం అభివృద్ధిపై అభినందనలు తెలియజేశారని వీసీ అన్నారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్న కులపతిగా పూర్తి సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. అందరి సహకారంతో విశ్వవిద్యాలయాన్ని మరింత అభివృద్ధిలోని తీసుకెళ్తామని వీసీ తెలియజేశారు.



### మార్చి 23 (భగత్ సింగ్ వర్ధంతి)

## ఇంక్విలాబ్ జిందాబాద్!!



*భాస్వరాన్ని ఎప్పుడూ నీళ్లలోనే భద్రపరుస్తారుట.*
*భగత్ సింగ్ సమాధిని అందుకే నీళ్ళ మధ్యనే కట్టారట.*
*షహీద్ భగత్ సింగ్ సమాధి - తేజ్ మహల్!*
*తేజ్ మహల్ వేదికపై ఒకే ఒక్క విప్లవ మంత్రం!*
*(సర్ ఫరోషీకి ఆజ్ తమన్నా హై దిల్ మే దేఖా కిత్నా జోర్ హై బఝూ - ఇ కాతర్ మే)*
*విప్లవాత్మకంగా దేశంకోసం ప్రాణాలు ఇచ్చే కోరిక నాకు ఉంది.*
*బ్రిటిష్ హంతకుల దగ్గర ఆ శక్తి ఉందా?!*
*...అని ప్రశ్నించిన దేశభక్తికి ప్రతిరూపం!భగత్ సింగ్!!*
*ఆ దేశభక్తునకిదే అక్షర నివాళి!!*

**- నన్నయ వాణి**






## శుభాకాంక్షలు!!

**- నన్నయవాణి**

## నన్నయ షార్ట్ ఫిలిం కాంటెస్ట్



షార్ట్ ఫిలిం బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

**23.03.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మీడియా సెల్ ఆధ్వర్యంలో షాప్ట్ ఫిలిం కాంటెస్ట్ ను నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్న విద్యార్థిని విద్యార్థులంతా దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. మంగళ వారం విశ్వవిద్యాలయంలో షార్ట్ ఫిలిం కాంటెస్ట్ బ్రోచర్ ను వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. "కోవిడ్ 19 నన్నయ విద్యా వికాసం" అనే అంశంపై షార్ట్ ఫిలిం కాంటెస్ట్ నిర్వహిస్తున్నామని కోవిడ్ సమయంలో విశ్వవిద్యాలయం తీసుకున్న జాగ్రత్తలు, ఆన్లైన్ ప్లాట్ ఫాం అభివృద్ధి, 75 వెబినార్ల నిర్వహణ, ఆన్ లైన్ తరగతులు, క్యాంపస్ శానిటేషన్, పరీక్షణ నిర్వహణ, ప్రస్తుత పరిస్థితులు మరియు విశ్వవిద్యాలయ అభివృద్ధికి విద్యార్థుల ఆలోచనలు వంటి అంశాలపై విశ్వవిద్యాలయ అభివృద్ధిని ప్రతి బింబించేలా షార్ట్ ఫిలిం రూపొందించాలని అన్నారు. 5 నిమిషాల నిడివిలో కాపీ రైట్స్ సమస్యలు రాకుండా విశ్వవిద్యాలయ అభివృద్ధికి అద్దంపట్టే విధంగా షార్ట్ ఫిలిం రూపొందించి ఏప్రిల్ 14వ తేది నాటికి మీడియా సెల్‌కు సమర్పించాలని చెప్పారు. దీనిలో విజేతలైన వారికి ప్రథమ బహుమతి రూ.3000, ద్వితీయ బహుమతి రూ.2000, తృతీయ బహుమతి రూ.1000 మరియు షార్ట్ ఫిలింలో భాగస్వామ్య మైన వారందరికీ మీడియా సెల్ సర్టిఫికెట్ ప్రదానం చేస్తామని తెలియజేశారు. దీనిని విశ్వ విద్యాలయ విద్యార్థులంతా సద్వినియోగం చేసుకొని ప్రతిభను కనపరచాలని రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ అన్నారు. ఈ కార్యక్ర మంలో నన్నయ వాణి ఎడిటర్ డా.తలారివాసు, మీడియా సెల్ కోఆర్డినేటర్ పువ్వల ఆనంద్, లీగల్ ఆఫీసర్ నందెపు నాగేంద్రరావు, ఫ్యాకల్టీ ఆసోసియేట్ డా.ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.




## 'నన్నయ'లో క్రీడాభివృద్ధికి సాయ్ కమిటీ పరిశీలన

**25.03.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో క్రీడాభివృద్ధికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియ(సాయ్) కమిటీ గురువారం విశ్వవిద్యాలయంలో పర్యటించి క్రీడా మైదానాలను, వసతులను పరిశీలించారు. "కేంద్ర ఖేలో ఇండియా" పథకంలో భాగంగా క్రీడా ప్రాంగణాల మౌలిక సదుపాయాల నిర్మాణాలకు నిధులు మంజూరు ప్రతిపాదనలతో పాటు వాటి సాధ్య సాధ్యాలపై నివేదికను సమర్పించేందుకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియ(సాయ్) సభ్యులు ఏలూరుకు చెందిన సీనియర్ అథ్లెటిక్ కోచ్ ఇన్చార్జి డి.ఎన్.వి వినాయక ప్రసాద్, బెంగళూరు కు చెందిన సహాయ స్విమ్మింగ్ అకడమిక్ కోచ్ మాథ్యూస్ అబ్రహాం, విశాఖపట్నంకు చెందిన సీనియర్ వాలీబాల్ కోచ్ ఇన్ఛార్జి కె.సి త్రిపాఠి విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ మాట్లాడుతూ ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో క్రీడాభివృద్ధికి సహకరిస్తున్న వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావుకు, ఎంపి మార్గాని భరత్ కు అభినందనలు తెలియజేసారు. విశ్వవిద్యాలయంలో 400 మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం {60×40 మీటర్లు} నిర్మాణానికి, స్టాండర్డ్ స్విమ్మింగ్ పూల్ {50×21 మీటర్లు} నిర్మాణ అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేయడానికి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నియమించిన కమిటీ పర్యటించిందని అన్నారు. సాంకేతిక నివేదికను ముగ్గురు నిపుణుల కమిటీ క్షేత్ర పరిశీలన చేసి సిఫార్సును సమర్పిస్తారని చెప్పారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు డి.ఎన్.వి వినాయక ప్రసాద్ మాట్లాడుతూ పై నిర్మాణానికి కావల్సిన చక్కని వాతావరణం, ప్రాంగణం విశ్వవిద్యాలయంలో ఉందని తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణ పరిశీలనపై సంతృప్తి చెందుతున్నామని సానుకూలంగా స్పందించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో క్రీడలను అభివృద్ధి చేయడం ద్వారా విశ్వవిద్యాలయ ప్రగతి మరింత అభివృద్ధి చెందుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ ఆచార్య ఎస్.టేకి, డా.కె.సుబ్బారావు, డా.బి.రామ్ గోపాల్, పీడీ రాజు, విశ్వవిద్యాలయ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సంపాదకీయం



# రంగుల ప్రపంచం!

జీవితాన్ని రంగులమయం చేసుకోవటం మన చేతుల్లోనే ఉంది. ప్రతి మనిషి తన జీవితాన్ని, తనను తాను ఉన్నత స్థితికి తీసుకెళ్లే సామర్థ్యమే కాకుండా సమాజ సమష్టి చైతన్యాన్ని కూడా ఉన్నత స్థితికి తీసుకెళ్లగలిగే శక్తిని కలిగి ఉంటాడు. సందేహమే లేదు. "ఈరోజు" మనకు లభించిన కానుక. దానిని సరైన దినచర్య తో సద్వినియోగం చేసుకోవటమే మనం చేయగలిగిన పని.

మనం వాహనాన్ని నడపాలనుకున్నప్పుడు రోడ్డు మీద ఉండే ఆటంకాలని, ఇబ్బందుల్ని, ట్రాఫిక్ జామ్‌ని భరించాలి. తప్పదు. 'చెయ్యలేం' అనే ఉద్దేశాన్ని కలిగి ఉండటం వలన కొన్ని మనం చెయ్యం. 'చెయ్యగలం' అనే అలవాటుగా మారటానికి కొంత అభ్యాసం కావాలి. ప్రపంచం ఎలా ఉన్నా మనం ఆనందంగా ఉండటం మన చేతుల్లోనే ఉంది. దానికి చేయాల్సింది ప్రపంచాన్ని ఉన్నదున్నట్టుగా స్వీకరించి దాని పట్ల మన వైఖరిని మార్చుకోవడం.

తెల్లబట్టలు వేసుకున్నంత మాత్రాన వాళ్ల మనసు స్వచ్ఛమైందని అర్థం కాదు. అలాగని పూలచొక్కా వేసుకున్నంత మాత్రాన పోకిరి అని కూడా కాదు. కాషాయం కట్టుకుంటే ఆధ్యాత్మిక వేత్త అని అసలే కాదు. సమగ్ర మూర్తిమత్వం అన్నప్పుడు కేవలం డ్రెస్ మాత్రమే కాదు. మాట, ప్రవర్తన, ఇతరుల పట్ల వైఖరి...ఇవన్నీను. ఈ ప్రపంచం ఎలా ప్రవర్తిస్తోందనేది మనకు సంబంధించిన విషయం కాదు. మన వ్యక్తిత్వంతో మనం జీవించడమే ముఖ్యం. అది ఆత్మాభిమానంతో కావచ్చు, భావోద్రేకాలను నియంత్రించుకుంటూ కావచ్చు.

సరైన చదువు, దినచర్య, అభ్యాసం... ఇవేకదా మనం ఎదగడానికిగల గొప్ప సూత్రాలు. మరొక విషయం.. మనకు మనమే అత్యంత విలువైన "వనరు". దానిని సద్వినియోగం చేసుకోవడం వల్లనే మనకొక అందమైన ప్రపంచం ఏర్పడుతుంది. మనల్ని మనం సరైన పద్ధతిలో వినియోగించుకున్నామా? అని ఒకసారి ప్రశ్నించుకోవాలి. ఇతరులను వాడుకోవటం కాదు. మనల్ని మనం తగినంతగా వాడుకుంటున్నామా... అని పదే పదే ప్రశ్నించుకోవాలి. మన పరిధి చాలా పెద్దది. దాని నిండా కావలసినంత నింపుకోవచ్చు. మనసు నిండా ఒంపుకోవచ్చు. మన నైపుణ్యాలను మన పరిధి నిండా వినియోగించుకున్నపుడే ఇంద్రధనుస్సులో ఏడు రంగులు స్పష్టంగా కనిపిస్తాయి.అవి బయట ఆకాశంలో కాదు, మనలోనే ఉన్నాయని అర్థమవుతుంది. ఆ రంగుల ప్రపంచంలో మనమే రారాజు, మనమే విజేత, మనమే గొప్ప వ్యక్తి, మనదే సమగ్రమైన మూర్తిమత్వం!!

*ముఖ్యంగా విద్యార్థి దశలో అభ్యాసం, నైపుణ్యాలను మెరుగు పరచుకోవడం, విస్తృతమైన అధ్యయనం, నిర్మలమైన మనసు, మనం ఏమి అవ్వాలని అనుకుంటున్నామో దాని పట్ల అవగాహన, సమయపాలన, సరైన వైఖరి ఇదే అంతర్గతమైన ఇంద్ర ధనుస్సు! ఇవే జీవితానికి సంబంధించిన రంగులు! ఇదే హోలీ!!*

హోలీని పరిపూర్ణంగా అనుభవించండి. అవును... జీవితం స్వచ్ఛమైన రంగులమయం కాబోతుంది. జయహో!!

# మానవ మనుగడకు జలమే ప్రాణాధారము



**29.03.21 (మీడియాసెల్)** మానవ మనుగడకు జలమే ప్రాణాధారమని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథ రావు అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలో ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా జల శక్తి అభియాన్ ప్రతిజ్ఞను నిర్వహించారు. వీసీ ఆదేశాల మేరకు విశ్వవిద్యాలయంలోని అన్ని కళాశాలలో విద్యార్థులు ప్రతిజ్ఞ చేపట్టారు. యూనివర్సిటీ ఈసి హాల్‌లోని వీసీ, విశ్వవిద్యాలయ అధికారులు ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సమస్త జీవకోటి మనుగడకు జలమే ప్రాణాధారమని, ప్రతీ నీటి చుక్క మన ఆత్మ బంధువని, నీటిని పొదుపుగా వాడాలని అన్నారు. ప్రతీ వర్షపు చుక్కను ఒడిసి పట్టే విధంగా విశ్వవిద్యాలయంలో ఇంకుడుగుంత ఏర్పాటు చేసామన్నారు. విశ్వవిద్యాలయంలోని చెరువును అభివృద్ధి చేస్తామని తెలిపారు. అందరూ జలవనరులను కాపాడుదామని, ఇండ్ల ఆవరణలో, రోడ్ల వెంట, ఖాళీ స్థలములలో, పొలాల గట్ల వెంట మరియు బీడు భూములలో చెట్లను పెంచుదామని అన్నారు. పర్యావరణ రక్షణకు నీటిని సంరక్షించాలని, మరియు చెట్లను పెంచి భావితరాలకు ఆహ్లాదకరమైన ప్రకృతినందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి. అశోక్, ప్రిన్సిపాల్, డీన్స్ అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగ అనుభవాలను సంపాదించుకోండి



**24.03.21 (మీడియాసెల్)** చదువుకున్న ప్రతీ విద్యార్థి ఉద్యోగాలలో చేరి అనుభవాలను సంపాదించుకుని ఉన్నత ఉద్యోగాలలో స్థిరపడాలని రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్ అన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారిచే ఆదికవి నన్నయ విశ్వవిద్యా లయంలో స్కిల్ కనెక్ట్ డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ హాజరై యువత నుద్దేశించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరూ ఏదో ఉద్యోగంలో నైపుణ్యతను, అనుభవాన్ని సంపాదించుకోవాలని అన్నారు. ఉభయగోదావరి జిల్లాల నుండి 370 మంది నిరుద్యోగులైన యువత స్కిల్ కనెక్ట్ డ్రైవ్ రిజిస్టేషన్ లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఫ్లెక్స్ ఇండియా, హీరో మోటార్స్, రైసింగ్ స్టార్ మొబైల్స్ ప్రైవేట్ లిమిటెడ్, కల్బిగివైర్ వంటి కంపెనీలకు చెందిన హెచ్‌ఆర్‌లు అభ్యర్థులకు గ్రూప్ డిస్కర్షన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీరిలో హీరో మోటార్స్ 22 మంది, ఫ్లెక్స్ ఇండియా 17 మంది, రైసింగ్ స్టార్‌కు 31 మంది అభ్యర్థులు ఎంపికయ్యారు. కల్బిగివైర్ కంపెనీ 66 మంది అభ్యర్థులను షాట్ లిస్ట్ చేసి పూర్తి వెరిఫికేషన్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆయా కంపెనీలలో ఎంపికైన అభ్యర్థులకు జాయినింగ్ లెటర్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ డా.బి.జగన్మోహనరెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ డా.పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డా.కె.రమణేశ్వరి, జిల్లా నైపుణ్యాధికారి డి.హరిశేషు, ప్లేస్మెంట్ ఆఫీసర్ పెరుమాళ్ళరావు పాల్గొన్నారు.

# వృక్ష దాతా సుఖీభవ



**28.03.21 (మీడియాసెల్)** ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి కాకినాడకు చెందిన వాసు ఇండస్ట్రీ అధినేత శిల్లా భద్రరావు 60 విలువైన మొక్కలను ఇచ్చారు. మొక్కలు నాటేందుకు అవసరమైన గోతులను మిషనుతో తీయించి, ఎరువును పెంటను సమకూర్చి, పని వారిని ఏర్పాటు చేసి ప్రత్యేక శ్రద్ధతో మొక్కలు నాటించారు. విశ్వవిద్యాలయాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దాలనే తన ఆలోచనకు సహకారాన్ని అందించిన భద్రరావుకు వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు కృతజ్ఞతలు తెలియజేశారు. విశ్వవిద్యాలయ అభివృద్ధికి అందరూ సహృదయంతో సహకారాన్ని అందించాలని వీసీ సూచించారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయ పర్యావరణానికి మరింత సహకారం అందిస్తానని శిల్లా భద్రరావు తెలిపారు.

# నన్నయలో హైపోక్లోరైడ్ ద్రావణం పిచికారి

## కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలని వీసీ సూచన



**27.03.21 (మీడియాసెల్)** కోవిడ్ 19 సెకండ్ వేవ్ విజృంభన నేపథ్యంలో కోవిడ్ కట్టడికి ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం అన్ని రకాల జాగ్రత్తలు వహిస్తుంది. శనివార విశ్వవిద్యాలయం క్యాంపస్ మొత్తం హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు మాట్లాడుతూ కోవిడ్ 19 విజృంభిస్తున్న నేపథ్యంలో విశ్వవిద్యాలయ క్యాంపస్‌లలో అన్ని రకాల జాగ్రత్తలూ తీసుకుంటున్నామని అన్నారు. అన్ని విభాగాలలోనూ పూర్తిగా హైపోక్లోరైడ్ ద్రావణాన్ని పిచికారి చేయించామని చెప్పారు. ఉభయగోదావరి జిల్లాల్లోని అధ్యాపకులు, విద్యార్థులు కోవిడ్ 19 పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని స్వీయ నియంత్రణ తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. వ్యక్తిగతంగా ఎవరికి వారు ఆరోగ్యాన్ని పరీక్షించుకుంటూ సమాజక్షేమం కోసం బాధ్యతగా ఉండాలని తెలియజేశారు. రిజిస్ట్రార్ ఆచార్య తుపాకుల అశోక్, శానిటేషన్ కోఆర్డినేటర్ డా.బి.రామ్ గోపాల్ పర్యవేక్షిస్తున్నారని అన్నారు.

# యువతలో చైతన్యానికే రెడ్ క్రాస్ సైకిల్‌యాత్ర

## ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీ వై.డి.రామారావు

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తూర్పుగోదావరి శాఖ చైర్మన్ శ్రీ వై.డి.రామారావు గారితో ఎడిటర్ ముఖాముఖి.



**నమస్తే సర్ .రెడ్ క్రాస్ సైకిల్ యాత్ర ఉద్దేశం...**

రక్తదాన అవసరం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా మొక్కల పెంపకం,పరిశుభ్ర వాతావరణం... ఈ మూడు విషయాలను సమాజంలోనికి తీసుకొని వెళ్ళటానికి ఈ యాత్ర మొదలైంది.

**ఎప్పటి నుండి ఇప్పటివరకు, ఎక్కడ నుండి, ఎంతమంది...**

మార్చి 16 నుండి 25 వరకు,శ్రీకాకుళం నుండి విజయవాడలో రాజభవన్ వరకు, 50 మందితో మొదలైంది.

**తూర్పుగోదావరి నుండి...**

ఇక్కడ 10 మంది కలుస్తున్నారు. అలాగే రాయలసీమలో నెల్లూరునుండి బయలుదేరి విజయవాడ చేరుతారు.

**ఈ నెలలోనే యాత్ర ఉద్దేశం..**

రెడ్ క్రాస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.

**ఈ యాత్రలో దినచర్య...**

ఈ ర్యాలీలో భాగంగా దారిలో ఉండే ప్రధానమైన పాఠశాలలు, కళాశాలలను సందర్శించి యువతలో చైతన్యం తీసుకొని రావటం, సేవా కార్యక్రమాల అవగాహన కల్పించటం రెడ్ క్రాస్ ప్రధాన ఉద్దేశం.

సంతోషం సర్. యాత్రలో భాగంగా ఇక్కడ మొక్కలు నాటే కార్యక్రమాన్ని తమరు, విశ్వవిద్యాలయ యూత్ రెడ్ క్రాస్ కో ఆర్డినేటర్ డా.పడాల రాజశేఖర్ చేపట్టడం విద్యార్థుల్లో ఎంతో ఉత్సాహాన్ని కలిగించింది. నన్నయవాణి తరపున తమకు ధన్యవాదాల్ని తెలియజేస్తున్నాం.

**నమస్కారం.మళ్ళీ కలుద్దాం!!**



# విద్యార్థి లోకం

## రుసా నిధులకు దరఖాస్తు చేసుకోండి

**26.03.21 (మీడియాసెల్)** రూసా పరిశోధన ప్రాజెక్టులకు సంబంధించిన నిధులు కొరకు దరఖాస్తు చేసుకొని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయ రెగ్యులర్ అధ్యాపకులతో వీసీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దీనిలో ఆయన మాట్లాడుతూ రుసా పరిశోధన ప్రాజెక్టులకు విఫలం కాకుండా దరఖాస్తు చేసుకోవాలని ఆదేశిస్తారు. ప్రతి ఒక్కరూ స్పష్టమైన కట్ లక్ష్యాలు, ప్రామాణిక పద్ధతి మరియు ఆశించిన ఫలితాలతో మంచి ప్రతిపాదనలు వ్రాయాలని అన్నారు. సర్వే పనులు, వినియోగ వస్తువులు, పరిశోధన లేదా ప్రయోగశాల సహాయం, విశ్లేషణాత్మక ఛార్జీలు మొదలైన వాటి కోసం వివరణాత్మక సమర్థనతో డబ్బు అడగవచ్చునని తెలిపారు. రూసా నిధులతో సైన్స్ అండ్ టెక్నాలజీ ఆర్ట్స్ కళాశాలకు కొన్ని పరిశోధన ప్రాజెక్టులకు తీసుకువచ్చే విధంగా అధ్యాపకులు ప్రయత్నాలు చేయాలని చెప్పారు. తద్వారా విశ్వవిద్యాలయం అభివృద్ధి సాధ్యమవుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్స్, డీన్స్, కోఆర్డినేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జగన్నాథరావు

## ఓ స్త్రీ నిన్ను నీవు గౌరవించు కో...



భగవంతుని సృష్టిలో స్త్రీ, పురుషులు సమానమే అయినప్పటికీ, స్త్రీ ఎందుకో కొంచెం తక్కువ గౌరవింప బడుతుంది. స్త్రీ పరాశక్తి స్వరూపం వంటి మాటలు చెప్పు కుంటున్నా ఎక్కడో రావాల్సిన గౌరవం సమాజంలో రావటం లేదు. మార్పు మన నుండే రావాలి. టి.వి సీరియల్స్, సినిమాలలో స్త్రీని అవమాన పరుస్తూ, అత్తా కోడళ్ళ మధ్య వివాదాలు సృష్టిస్తూ, వీరిలో ఎవరో ఒకరిని ప్రతి నాయికగా చూపించే విధానం ఆగాలి. అదే విధంగా మన కట్టు బొట్టు, మన హుందాతనాన్ని, గౌరవాన్ని పెంచేదిగా వుండాలి. ప్రతి స్త్రీ తన వేష ధారణ, నడవడికను హుందాగా మరల్చుకోవాలి. సినిమాలలో కూడా నటీమణులు గౌరవప్రదమైన వస్త్ర ధారణతో నటించేలా, భారతీయ సంస్కృతిని ప్రతి బింబించేలా చూడాలి, తల్లిదండ్రులు తమ పిల్లలను సంప్రదాయ యుక్తం గా పెంచాలి. అప్పుడు సమాజం కూడా గుర్తిస్తుంది, గౌరవిస్తుంది.

కనుక ఓ స్త్రీ ముందు నిన్ను నువ్వు సంస్కరించుకుంటూ, ఆదర్శంగా నిలుస్తూ గౌరవించుకో.....

**- కె.టి.వి.సుబ్బలక్ష్మి, లెక్చరర్,**
**చాంబర్స్ డిగ్రీ కాలేజ్, పాలకొల్లు.**

అచంచలమైన దేశభక్తికి ప్రతిరూపమైన భగత్ సింగ్ రాజకీయ జీవితం మొత్తం ఏడేళ్లు మాత్రమే. ఆ కొద్ది కాలంలోనే ఆయన దేశ రాజకీయాల్లో నిర్వహించిన పాత్ర చిరస్మరణీయం. 1930 అక్టోబర్ లో కోర్టు ఉరిశిక్ష విధించగా 1931 మార్చి 23న అమలు జరిగింది. ఈ ఆరు నెలల కాలంలో ఎక్కడ నిరాశ, నిస్పృహలను దరిచేరనివ్వలేదు. క్షమాపణ కోరితే ఉరిశిక్ష నుండి మినహాయింపు పొందవచ్చున్న తండ్రి ఆవేదనను కూడా తిరస్కరించి బ్రిటిష్ సామ్రాజ్య వాదాన్ని తన బలిదానంతో సవాల్ చేశారు భగత్ సింగ్.

**- దగ్గు అశోక్ కుమార్**
**ఎమ్.ఏ. తెలుగు (ప్రథమ)**



## సాహిత్యం - వ్యక్తిత్వ వికాసం




అనుకోకుండా చేరాను ఎమ్. ఎ. ఇంగ్లీష్ కోర్సులో! అలా మొదలైంది విశ్వవిద్యాలయంలో నా ప్రయాణం. ఈ ప్రాంగణం లో ఎదురైన ప్రతి అడుగూ, అనుభవాలూ, అనుభూతులూ నా రేపటి గమ్యానికి దిశానిర్దేశమయ్యాయి. నేను పుట్టింది చిన్న గ్రామంలో! చిన్నప్పటి చదువంతా తెలుగు మీడియంలోనే.. ఇంట్లో ఇద్దరమూ ఆడపిల్లలమే.. 'ఆడపిల్లలకి చదువెందుకు? పదిహేనేళ్లకే పెళ్లి చేసేయాలి' అనుకునే ఆలోచనలున్న ప్రాంతంలో ఉండి కూడా మా తల్లిదండ్రులు మమ్మల్ని చదువు ఆపేయమని ఎప్పుడూ చెప్పలేదు. మా అక్క వాసంతి ప్రోత్సాహంతో, మా తల్లిదండ్రులిచ్చిన స్వేచ్ఛా సహకారాలతో మొదట సి.ఏ. చేయాలనే ఆలోచన ఉన్నప్పటికీ ఇంగ్లీష్ లిటరేచర్ లో పీజీ చేశాను.

ఈ కోర్సులో చేరినప్పటినుండీ అధ్యాపకుల పాఠాలతో పాటుగా వాళ్లిచ్చిన సలహాలూ, సూచనలూ నన్ను ఎంతగానో ప్రభావితం చేశాయి. వాళ్ళ ఉన్నతమైన ఆలోచనలూ, సుహృద్భావంతో కూడిన వాతావరణం నాలో స్ఫూర్తిని నింపాయి. 'పోస్ట్ కలోనియల్ లిటరేచర్' లాంటి కొత్త విషయాల్ని ఆచార్య రమేష్ గారు చెబుతుంటే ... ప్రపంచాన్ని సామ్రాజ్యవాదపు చెరల తెరల్ని చీల్చుకుని చూడాలని అర్థమైంది. డాక్టర్ డి.జ్యోతిర్మయి గారి 'డీకన్స్ట్రక్షన్' థియరీల విశ్లేషణ వింటున్నపుడు, ఆలోచనల్ని నవీన పద్ధతిలో హేతువాద ధోరణితో ఎలా పునర్నిర్మించుకోవాలో తెలిసింది. డాక్టర్ సజనా రాజ్ గారి పాఠాల ద్వారా భారతీయులు కూడా ఆంగ్లంలో రాయడంలో ఆంగ్లేయులకి ఏమాత్రం తీసిపోరని తెలుసుకున్నాను. నాకే తెలియని నాలోని ఒక కొత్త మనిషిని ఒక నిర్దిష్టమైన వ్యక్తిత్వంతో ఆవిష్కరించింది సాహిత్యం. ఈ ప్రయాణంలోనే తెలిసింది, యూజీసీ- నెట్ లేదా సెట్ పరీక్షలు క్వాలిఫై అయితే అవకాశాలు బాగుంటాయని! పీజీ అయిన వెంటనే కొంతకాలం ఒక ప్రైవేట్ విద్యా సంస్థలో ఆంగ్లం బోధించాను. అక్కడ పని చేస్తూనే ఏపీ సెట్ క్వాలిఫై అయ్యాను. ఆ తర్వాత ఒప్పంద అధ్యాపకురాలిగా నేను చదువుకున్న ఇదే విశ్వవిద్యాలయంలో చేరాను. 'ఇది చాలు, ఇక్కడితో ఆపేస్తాను' అనే ఆలోచనలు నాలో ఎప్పుడూ లేవు. "నువ్వు కష్టపడి పని చేయకుండా, జ్ఞానాన్ని నిరంతరం పెంచుకోకుండా ఆగిపోతే, సమాజం నీకు ఊరికే జీతం ఇవ్వదు" అని ఆచార్య రమేష్ గారు చెప్పే మాటలు నాకు ఆదర్శం. అందుకే ఇప్పటికి యూజీసీ - నెట్ నాలుగు సార్లు క్లియర్ చేశాను. గతవారం విడుదలైన గేట్ ఫలితాల్లో క్వాలిఫై అయ్యాను. ఏపీ - ఆర్ సెట్ లో మంచి రాంక్ పొందాను. గతనెల విడుదలైన ఏపీపీఎస్సీ నిర్వహించిన జూనియర్ కాలేజ్ మరియు పాలిటెక్నిక్ కాలేజ్ లెక్చరర్ ఉద్యోగ పరీక్షలలో ఉత్తీర్ణత సాధించాను. త్వరలో అపాయింట్మెంట్ ఆర్డర్ వస్తే.. మరొక కొత్త ప్రయాణం మొదలుపెడతాను. వెనక్కి తిరిగి చూస్తే.. విశ్వవిద్యాలయ అణువణువూ నాతో మాట్లాడుతుంది. విశ్వవిద్యాలయానికి కృతజ్ఞురాలనై ఉన్నాను. తానిచ్చిన స్నేహితులూ, తాను పరిచయం చేసిన వ్యక్తులూ, పుస్తకాలూ, రచయితలూ... ఆలోచిస్తే అద్భుతాల్లా అనిపిస్తాయి. వాటిని దాచుకుంటే అపురూపమైన జ్ఞాపకాల్లా నాలో ఒదిగిపోతాయి, నన్ను మాత్రం ఇంకా ఎదగమంటాయి.

**- డి.విద్యా శ్రీవాణి.**
**సహాయాచార్య,ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం.**


## 'నన్నయ'లో రెడ్ క్రాస్ సైకిల్ ర్యాలీ

**22.03.21 (మీడియాసెల్)** ఇండియన్ రెడ్ క్రాస్ సోసైటి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సైకిల్ ర్యాలీని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో జక్కంపూడి విజయలక్ష్మి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య తుపాలకుల అశోక్ మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సోసైటీ ప్రారంభమై 100 సంతవత్సరాలు పూర్తయిన సందర్భంగా శ్రీకాకుళం నుండి విజయవాడ వరకు ర్యాలీని నిర్వహిస్తున్నారని అన్నారు. మెరుగైన సమాజ నిర్మాణం కోసం రక్తదానం, పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై అవగాహన కల్పిస్తూ సాగుతున్న ఈ ర్యాలీ సోమవారం ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయానికి చేరుకుందన్నారు. జక్కంపూడి విజయలక్ష్మి రెడ్‌క్రాస్ సోసైటి అధికారులకు, వాలంటీర్లుకు, సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న యువతకు శుభాకాంక్షలను తెలియ జేశారు. తరువాత విశ్వవిద్యాలయం రెడ్ క్రాస్ యూనిట్ ఆధ్వర్యంలో శానిటేజర్లను, డ్రింక్స్‌ను పంపిణీ చేసి అతిథులను సన్మానించి అభినందనలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆచార్య పి.సురేష్ వర్మ, తూర్పుగోదావరి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ వై.డి.రామరావు, రెడ్ క్రాస్ ఈసీ మెంబర్ మహాలక్ష్మీ, యూనివర్సిటీ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డా.పడాల రాజశేఖర్, డా.బి.రామ్ గోపాల్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



రెడ్ క్రాస్ సైకిల్ ర్యాలీని ప్రారంభిస్తున్న దృశ్యం

## రెడ్ క్రాస్



1829 మే 8 న స్విట్జర్లాండ్ లో జన్మించిన వ్యాపార వేత్త, సామాజిక కార్యకర్త హెన్రి డ్యునాంట్ ఆలోచనల నుంచే రెడ్ క్రాస్ మొగ్గ తొడిగింది. (ఇప్పటి ఇటలీలో) ఆయన చూసిన సోల్ఫిరినో యుద్ధానంతర బీభత్సానికి చలించి "ఏ మెమరీ ఆఫ్ సోల్ఫిరీనో "రాశారు. అదే 1863లో సంస్థ ఆవిర్భావానికి కారణమైంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఇందులో స్వచ్ఛంద కార్యకర్తలు, ఉద్యోగులు, సభ్యులు మొత్తం కలిసి సుమారు 9.7 కోట్లమంది పనిచేస్తున్నారు. మొదటి నోబెల్ శాంతి పురస్కారాన్ని పొందిన డ్యునాంట్ స్మారకంగా ఆయన జయంతిని 1948 నుంచి రెడ్ క్రాస్ డే గా జరుపుతున్నారు. 1984లో దీనినే వరల్డ్ రెడ్ క్రాస్ అండ్ క్రెసెంట్ డే గా పేరు మార్చారు.

## మంచి మాట

**ఈ ప్రపంచం చెడ్డవారి వల్ల**
**చెడిపోలేదు**
**చెడును ప్రశ్నించకుండా**
**చేతులు కట్టుకున్న మంచివారి వల్ల**
**చెడిపోయింది**
**ధైర్యంగా అడగలేని**
**భయస్తుల వల్ల**
**మనకెందుకులే అనుకునే**
**స్వార్థపరుల వల్ల**
**చెడిపోయింది.**










# ఉమెన్స్ సెల్

ఉభయగోదావరి జిల్లాల్లోని మహిళలకు ఉన్నత విద్యను అందించడంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ప్రధాన పాత్రను పోషిస్తోంది . 70శాతం మంది విద్యార్థినులు ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ కామర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఎడ్యుకేషన్ మరియు డిప్లొమా కోర్సులలో విద్యను అభ్యసిస్తున్నారు. విద్యార్థినులతో పాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిలో ఎక్కువ మంది మహిళలు ఉండడం మరో విశేషం. ఇటువంటి ప్రత్యేకతను సంతరించుకున్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఉమెన్స్ సెల్ కీలక పాత్రను పోషిస్తూ ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తుంది. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉమెన్స్ సెల్ విశేషాలను తెలుసుకుందాం.






డా.పి.ఉమామహేశ్వరి,
సెక్రటరీ ఉమెన్స్ సెల్



డా.ఎన్.సజనారాజ్,
జాయింట్ సెక్రటరీ ఉమెన్స్ సెల్



డా.వి.పెర్సిస్,
ట్రెజరర్ ఉమెన్స్ సెల్

## ఉమెన్స్ సెల్ ప్రారంభం :- 2010

### ఉమెన్స్ సెల్ వార్షిక కార్యక్రమాలు:-

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహణ విద్యార్థులకు, అధ్యాపకులకు విద్య, విజ్ఞాన, క్రీడా పోటీలు
- మహిళ ఆరోగ్యపై సదస్సులు – ప్రముఖ గైనకాలజిస్టులతో అవగాహన సదస్సులు
- మగ్గం వర్క్ శిక్షణ – డాక్టర్ వినయ్ సుంకర్ ఫౌండేషన్ సహకారంతో 3 నెలల శిక్షణ తరగతులు
- మహిళా అభ్యున్నతిపై సదస్సులు సెమినార్లు, వర్క్ షాప్ లు, వెబినార్లు నిర్వహణ
- అనుబంధ కళాశాలల ఉమెన్స్ సెల్ పర్యవేక్షణ అన్ని కళాశాలల్లో ఉమెన్స్ సెల్ కార్యక్రమాలు నిర్వహణ

### ఉమెన్స్ సెల్ కో ఆర్డినేటర్లుగా సేవలందించిన వారు

| | |
|---|---|
| డా.ఎం.కమలకుమారి | 2010–12 |
| డా.పి.విజయనిర్మల | 2012–19 |
| డా.కె.నూకరత్నం | 2019–ప్రస్తుతం |

## మహిళలు ఔన్నత్యాన్ని చాటి చెప్పేలా...




ఉభయగోదావరి జిల్లాల్లోని మహిళ ఔన్నత్యాన్ని చాటిచెప్పే విధంగా ప్రయత్నాలు చేస్తున్నాం. గోదావరి జిల్లాల్లోని మహిళా స్వాతంత్ర్య సమర యోధులు, సంఘ సంస్కరణలకు పాటుపడిన మహిళలు, సామాజికవేత్తలు, ఉద్యమకారులు, సాంఘిక, రాజకీయ, ఆర్థిక నిపుణులు ఇలా అన్ని విభాగాలలో మహిళ ఉన్నతికి పాటుపడిన వ్యక్తుల చరిత్రతో పుస్తకాన్ని తీసుకువస్తాం. ఉభయగోదావరి జిల్లాల్లోని అంగన్ వాడీ మహిళల కోసం శ్రీమతి డొక్కా సీతమ్మ అంగన్ వాడీ డిప్లొమా కోర్సును సమర్థవంతంగా నడిపిస్తున్నాం. మహిళా సాధికారత కోసం భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తాం.

**డా.కె.నూకరత్నం, ఉమెన్స్ సెల్ కో ఆర్డినేటర్**






















ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in